# శ్రీ గురుభ్యోన్నమః

# గురువు వినా దైవము లేడు!

## -కృష్ణుణ్ణి, వ్యాసుణ్ణీ, శంకరభగవత్పాదులందర్నీ గురువులుగా కీర్తించిన దేశం మన దేశం!-

గురువుల్ని దైవంగా ఆరాధించే దేశం భారతదేశం. జగద్గురువుగా పూజలందు కుంటూండే శ్రీకృష్ణుడు తన గురువైన సాందీపుణ్ణి గౌరవించారు.

భారతదేశంలో ఎందరో గురువులు అవతరించారు. జనుల్ని ధర్మయుతులుగా నడిచే మార్గాన్ని బోధించారు.

బ్రహ్మ విష్ణు మహేశ్వరులను త్రిమూర్తులుగా ఆరాధించినట్లే, శంకర, రామానుజ, మధ్వాచార్యులను త్రిమతాచార్యులుగా గురు పూజచేసే సదాచారం భారతీయుల్లో నెలకొని ఉన్నది. అష్టాదశపురాణాలను రచించిన వ్యాసుణ్ణి గురువుగా భావించి, ముప్పురు ఆచార్య శిష్యపరంపర గురు సంపన్నులుగా ఆరాధిస్తారు. దీనినే వ్యాసపూజని అంటారు. సాయిని ఆరాధించే భక్తులు దత్తాత్రేయుణ్ణి గురువుగా భావించి ఆరాధిస్తారు. కొందరు దక్షిణామూర్తిని గురువుగా ఆరాధిస్తారు.

ఎవరు ఏ సాంప్రదాయ గురువును ఆరాధించినప్పటికినీ గురువును పర బ్రహ్మంగా తలచి ఆరాధించడం భారతీయ సాంప్రదాయం. ఈ ఆచారం అనాదిగా వస్తూన్నది. లౌకిక ప్రపంచంలో రామకృష్ణ పరమహంస శారదామాత, వివేకానందుడు, రమణమహర్షి, సాయిబాబా, మెహర్‌బాబా, కంచిపరమాచార్య, సత్యసాయిబాబా ఆదిగా గల గురువరేణ్యులు యిప్పటికీ పూజ, గురుపూజలందుకుంటూనే ఉన్నారు.

ఎవరు ఆర్తితో ఏ గురువును ఆరాధించినా, ఆ గురువు ఆర్తులను ఆదుకుంటాడన్నది పరమ సత్యం. గురువుల ముఖతః వెలువడిన అమృతోపదేశాలు వారిని చైతన్యవంతం చేస్తాయి. స్థైర్యానిస్తాయి. బ్రహ్మం ఒకటే అన్నట్లు గురువు కూడా ఒక్కడే. రెండుగా ఏదీ లేదంటారు విజ్ఞులు. రామకృష్ణ పరమహంస బ్రహ్మం రెండు కాదు అన్నారు.

**తాఁకేకే ఊ బోల్చే అల్లా కే ఊ గాడ్ కే ఊ బోల్చే బ్రహ్మ**
**కే ఊ కాళీ కే ఊ బోల్చే రామ, హరి, జేసు, దుర్గా**

– ఆ గురుబ్రహ్మలను అల్లా అనీ, 'గాడ్' అనీ, బ్రహ్మం అనీ, కాళీ అనీ రామయని యేసు అనీ, హరి యనీ, దుర్గ అనీ రామకృష్ణులు కొలుస్తారు. అంటూ నీళ్ళను చేతుల్లో తీసుకుని నీరు అని కొందరు పానీ యని కొందరు వాటర్ అని కొందరు అన్నట్లే– ఆయా వారి భాషల్లో ఒక పదార్థమును వేరువేరు పేరులతో చెప్పుకున్నట్లుగానే దైవ, గురు సంబోధనం జరుగుతుందన్నారు.

ఒక్కొక్క మతానిది, ఆ మతంలోని ఒక్కొక్క శాఖకు ఒక్కో పేరు చెప్పుకొన్నప్పటికినీ– వివిధ నదులు సముద్రంలో కలిసినట్లు ఒకే సర్వేశ్వరుణ్ణి చేరుతాయ్.

ఒక్క సూర్యుండు, సమస్త జీవులకు తానొక్కడై తోచుపోలికినే దేవుడు, **సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్నజ జన్యకదంబుల, హృత్సరోరుహములన్, నానా విధానూన రూపకుడై యొప్పుచునుండు నట్టి హరినే ప్రార్థింతు శుద్ధుండనై–** అని ఒక్క పద్యంలోని నాలుగు పాదాల్లో ఒప్పుగ చెప్పారు. "ఒకే సూర్యుడు సకలజీవరాసులలో ఒక్కొక్కడుగా కనిపించే విధంగా, తాను సృష్టించిన నానావిధ ప్రాణి సమూహాల హృదయ కమలాలలో, నానావిధములైన రూపాలతో సర్వకాలములందూ లీలా విలాసములో కనిపించే భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను" అంటాడు భీష్ముడు.


తనను అర్పించుకుని ఉన్నవాణ్ణి రక్షించడం భగవంతుని విధి – అన్నారు రమణ మహర్షి. గుండెభక్తితో నిండాలి, ఆర్తితో కొలవాలి– అన్నది భారతీయ ధర్మం, గురు విశిష్టతలోని పరమార్థం. **గురువే దైవం, దైవమే గురువు.**


వృక్షమెన్ని కొమ్మలూ, రెమ్మలుగా కనిపించినప్పటికినీ దాని కాండము ఒక్కటే. 'ఆచెట్టు' ఆ కాండముల ద్వారానే పటిష్టంగా ఉంటుంది. గురువులూ, గురుబోధలూ అలాటి ఏకత్వం కలవే! ఏకత్వంలో భిన్నత్వం, భిన్నత్వంలో ఏకత్వమును భారతీయత గౌరవిస్తూన్నది. ప్రముఖాంధ్ర ఏ ఒక్కర్నీ నొప్పించకుండా ఇరవై సంవత్సరాల నిండు జీవితంతో గురు ఆరాధనతో పునీతమైంది.













## విద్యాప్రకాశానందగిరి స్వామి అపరవ్యాసుడు!



వ్యాసుడు మనకందించిన పురాతన వ్యాసాంగన్నంతా విద్యాప్రకాశానందగిరి అందచేసారు. జగద్గురువు కృష్ణ భగవానుడు ప్రసాదించిన భగవద్గీత భావాన్నెంతో చక్కగా విశదపరచిన గ్రంథ సౌరభం, శ్రీకృష్ణుని అంతరంగాన్ని విపులీకరించిన ఘనత విద్యాప్రకాశానంద గిరిస్వామివారికే దక్కింది. 'గీత' విజ్ఞాన విశాలత్వాన్ని, దాని వెనుక గల శ్రీకృష్ణుని అంతరంగాన్నీ విమలంగా విశ్లేషించిన తీరు చూచినపుడు– కృష్ణుడే వెనుక ఉండి విశ్లేషింప చేసాడేమో నన్న భావన కలుగకపోదు.

ఆయనలో వాల్మీకి, వ్యాసుడు, శుకుడు, వశిష్ఠుడాది మునిసత్తముల హృదయ కుహరములు అంతర్లీనమై ఉన్నాయా– యీ నల్వురు మునుల ఏకరూపంగా–ఇల ఇలలో – అవతరించారాయని కూడా అనుకుంటూంటాను. ఇన్ని వందల, వేల పేజీల పురాణ సాహిత్యము నందించుట ఎవరికి శఖ్యము? శ్రీకాళహస్తిలో శుకబ్రహ్మాశ్రమును స్థాపించిన ఒక్క విద్యా ప్రకాశానందగిరి స్వామివారికే సాధ్యమైంది. స్వామి వివేకానందునిలా గురువిరచితమైన గ్రంథాలను పునర్ముద్రించిన విద్యాప్రకాశానందగిరి స్వామివారికి వందనం శతముల నర్పిస్తున్నాం.





